క్లుప్తంగా

పిల్లలకు సామగ్రి వితరణ



సామగ్రి ఇస్తున్న పవిత్ర, రజనీకాంత్

గుడిపాల: స్థానిక చెరువుముందరవూరు అంగన్వాడీ కేంద్రంలోని పిల్లలకు ఓ దాత సామగ్రిని వితరణగా అందజేశారు. బుధవారం అంగన్వాడీలోని పిల్లల కోసం అదే గ్రామానికి చెందిన దాత పవిత్ర మ్యాట్‌లు, ప్లేట్లు, చాపలు, దుప్పట్లను సర్పంచ్ రజనీకాంత్ చేతులమీదుగా పిల్లలకు వితరణగా అందజేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ లక్ష్మి, మహిళా పోలీస్ పావని పాల్గొన్నారు.

నేడు మండల సాధారణ సమావేశం

తవణంపల్లె: స్థానిక ఎంపీడీఓ సమావేశ భవనంలో గురువారం మధ్యాహ్నం 2.30 గంటలకు తవణంపల్లె మండల సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీఓ అబ్దుల్‌కలాం ఆజాద్ తెలిపారు. మండల మీట్ సమావేశం ఎంపీపీ గీతారెడ్డి అధ్యక్షతన నిర్వహిస్తామన్నారు. సమావేశానికి అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరుకావాలని కోరారు.

గోవిందరెడ్డిపల్లెలో వైఎస్సార్ కంటి వెలుగు



కళ్లద్దాలు పంపిణీ చేస్తున్న ప్రవీణ్‌కుమార్

ఐరాల: కంటిచూపు సమస్యలతో బాధపడుతున్న అవ్వాతాతలకు డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు చూపు ప్రసాదిస్తోందని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. బుధవారం గోవిందరెడ్డిపల్లెలో మూడో విడత కంటి వెలుగు ద్వారా కంటి చికిత్స చేసుకున్న 120 మంది వృద్ధులకు ప్రభుత్వం అందజేసిన కళ్లద్దాలు ఆయన పంపిణీ చేశారు. డాక్టర్ మాట్లాడుతూ 60 ఏళ్లు పైబడిన వృద్ధులకు వైద్య, ఆరోగ్య శాఖ ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహిస్తోందన్నారు. చూపు సమస్యలతో బాధపడుతున్న వారిని గుర్తించి మందులు, కళ్లద్దాలు అందించడంతో పాటు క్యాటరాక్ట్ శస్త్రచికిత్స ఉచితంగా చేస్తోందన్నారు.

వంద శాతం వ్యాక్సినేషన్ చేయాలి

యాదమరి: గ్రామాల్లో వందశాతం వ్యాక్సినేషన్ పూర్తిచేయాలని వైద్యాధికారి సురేఖ ఆదేశించారు. బుధవారం ఆమె దాసరాపల్లెలో వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. అనంతరం వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. సీహెచ్ఓ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుపడాలి



మాట్లాడుతున్న కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: నగరంలో పారిశుధ్యం మెరుగుపడాలని చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అరుణ ఆదేశించారు. బుధవారం ఉదయం పలు ప్రాంతాల్లో కమిషనర్ తనిఖీలు నిర్వహించారు. ఇంటింటా చెత్త సేకరణలో తడి–పొడి చెత్త వేర్వేరుగా తీసుకోవాలన్నారు. వ్యర్థాలను కాలువల్లో పడేయకుండా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. కమిషనర్ వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిన్నయ్య ఉన్నారు.

తృటిలో తప్పిన ప్రమాదం



గుడిపాల: ఓ లారీకి తృటిలో ప్రమాదం తప్పింది. బుధవారం తమిళనాడు నుంచి ఓ కంటైనర్ లారీ గుడిపాలకు వెళుతోంది. చలిచీమలపల్లె సమీపంలో విద్యుత్ తీగలు కంటైనర్‌కు తగలడంతో డ్రైవర్ గమనించి లారీలో నుంచి బయటకు దూకేశాడు. వైర్ల రాపిడి కారణంగా ట్రాన్స్‌ఫార్మర్‌లో ఫ్యూజ్ పోవడంతో ప్రమాదం తప్పింది. అప్పటికీ టైర్లపైన కరెంట్ తీగలు పడడంతో టైర్ కాలింది. గ్రామస్తులు చూసి టైర్లకు నీళ్లు పోసి మంటలు ఆపారు. విషయం తెలిసి ట్రాన్స్‌కో ఏఈ కరీముల్లా సంఘటన స్థలానికి చేరుకుని వెంటనే మరమ్మతులు చేయించారు.

నాడు–నేడు పనుల పరిశీలన

నగరి: మండలంలో నాడు–నేడు పథకంలో చేపడుతున్న పనులను జిల్లా విద్యాశాఖ అధికారి విజయేంద్రరావు, అదనపు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ వెంకటరమణారెడ్డి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా నాడు–నేడులో భాగంగా పూర్తయిన 10 స్కూళ్లను, పెయింటింగ్ పనులు జరుగుతున్న కొన్ని స్కూళ్లను పరిశీలించిన వారు త్వరగా పాఠశాలలను విద్యార్థులకు అందుబాటులోకి తేవాలన్నారు. జరుగుతున్న పనుల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో పొందుపరచాలన్నారు. ఆయన వెంట ఎంఈఓ నమశ్శివాయం, హెచ్ఎం, క్లస్టర్ రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా పథకాలు

● పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు



లబ్ధిదారుతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్‌బాబు

పూతలపట్టు: అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం జగనన్నకే సాధ్యమని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. బుధవారం పూతలపట్టు–1వ పంచాయతీలో ఎమ్మెల్యే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఎమ్మెల్యే దివంగత నేత సుబ్బారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు ఎమ్మెల్యే గడప గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తూ బుక్‌లెట్‌లను అందజేశారు. స్థానిక సమస్యలను ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, వెంటనే స్పందించిన ఆయన వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఎన్నికలు ముగిసిన తరువాత మళ్లీ ఎన్నికలు వచ్చే వరకు పాలకులు ప్రజలను కలిసేవారుకారని అన్నారు. ప్రస్తుతం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను నెరవేర్చడంతో ప్రజల్లో ధైర్యంగా తిరుగుతున్నామన్నారు. జగనన్నను మళ్లీ ఆశీర్వదించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ముస్లింలు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. పెనుగొండ పరిశీలకులు బాబురెడ్డి, పార్టీ కన్వీనర్ శ్రీకాంత్‌రెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ నేతలు జగదీశ్వర్‌రెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, సర్పంచుల సంఘ అధ్యక్షుడు జయచంద్రారెడ్డి, సర్పంచ్ మాసిలామణి, వైస్ సర్పంచ్ బాబురెడ్డి, సింగల్‌విండో అధ్యక్షుడు దొరస్వామిరెడ్డి, కోఆప్షన్ మెంబర్ ఖాదర్‌వల్లి, వైస్ ఎంపీపీలు ద్వారకనాథరెడ్డి, మురళీకృష్ణ, జెడ్పీటీసీ సభ్యురాలు దేవిక, ఎంపీడీఓ గౌరి, తహసీల్దార్ విజయభాస్కర్, ఎస్ఐ సురేష్, నేతలు రాజారత్నంరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, లోకేష్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు గడప గడపకు...

గురువారం పూతలపట్టు 1వ పంచాయతీ గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ గౌరి ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎంఎస్‌బాబు హాజరు కానున్నట్లు తెలిపారు.

సకాలంలో టీకాలు వేయించాలి

తవణంపల్లె: పిల్లలకు సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి రవిరాజు సూచించారు. బుధవారం మండలంలోని దిగువమాఘంలో నిర్వహించిన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని సందర్శించారు. 104 సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం తవణంపల్లె పీహెచ్‌సీని తనిఖీ చేశారు. పీహెచ్‌సీలోని రికార్డులను పరిశీలించారు. మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమంపై సలహాలు, సూచనలు ఇచ్చారు. వైద్యాధికారులు డాక్టర్ ధాత్రేయచౌదరి, డాక్టర్ ప్రియాంక, డాక్టర్ మోహన్‌వేలు, సీహెచ్ఓ సుబ్రమణ్యం, పీహెచ్ఎన్ భారతి పాల్గొన్నారు.

మహిళా సంఘాల పటిష్టతే ధ్యేయం



మాట్లాడుతున్న హేమచంద్రారెడ్డి

గుడిపాల: మహిళా సంఘాలను పటిష్ట పరచడమే ప్రభుత్వ ధ్యేయమని వెలుగు సీసీ హేమచంద్రారెడ్డి అన్నారు. బుధవారం వసంతాపురం పంచాయతీలోని మహిళా సంఘ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కొత్తగా సభ్యులెవరైనా ఉంటే గ్రూపుల్లో సభ్యురాలిగా చేర్పించుకోవాలన్నారు. గతంలో ఒక్కో గ్రూపునకు రూ.10 లక్షల వరకే ఇచ్చేవారని ప్రస్తుతం ఒక్కో గ్రూపునకు రూ.20లక్షలు బ్యాంక్ లింకేజీ ద్వారా ఇస్తారన్నారు. తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లిస్తే వడ్డీలేని రుణాలు మహిళా సభ్యులకు వస్తాయన్నారు. ఆగస్టు 10న సున్నా వడ్డీ నగదును మహిళా సభ్యుల ఖాతాల్లో ప్రభుత్వం జమచేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో సంఘమిత్ర సరస్వతి, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఆటల పోటీల్లో రాణించిన దివ్యాంగులు



ప్రశంసాపత్రాలను అందుకుంటున్న ధనుష్

తవణంపల్లె: జిల్లా స్థాయి దివ్యాంగుల పిల్లల ఆటల పోటీల్లో తవణంపల్లె భవిత విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపి రాణించారు. మండల స్థాయిలో నిర్వహించిన ఆటల పోటీల్లో ముగ్గురు దివ్యాంగుల పిల్లలు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. బుధవారం చిత్తూరులోని కన్నన్ హైస్కూల్లో ప్రత్యేక అవసరాల పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించారు. జిల్లా స్థాయి పోటీల్లో తవణంపల్లె భవిత కేంద్రానికి చెందిన వి.ధనుష్ బాలుర జట్టులో పరుగు పందెంలో ప్రథమ స్థాయిలో నిలిచారు. బాలికల జట్టులో చారుప్రియ ద్వితీయ స్థానంలో నిలిచింది. వీరిద్దరు రాష్ట్రస్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటారని సహిత విద్య ఉపాధ్యాయుడు దేవేంద్ర తెలిపారు. జిల్లా స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ చూపి గెలిచిన దివ్యాంగులకు ప్రశంసాపత్రాలు అందజేశారు.

ఆకట్టుకుంటున్న హస్తకళా ప్రదర్శన







హస్తకళా ప్రదర్శనలో అమ్మకానికి ఉంచిన వస్తువులు, దుస్తులు

చిత్తూరు రూరల్: నగరంలోని సీఎం కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన కళాభారతి చేనేత హస్తకళా ప్రదర్శన ప్రజలను విశేషంగా ఆకట్టుకుంటోంది. ప్రధానంగా చేనేత వస్త్రాలు పోచంపల్లి, డ్రస్ మెటీరియల్స్, శారీస్, కళంకారి, ఖాదీ వస్త్రాలు, మంగళగిరి చీరలు, చిన్నారుల దుస్తులు అదుర్స్ అనిపిస్తోంది. ఇంటి అలంకరణ వస్తువులు, కొండపల్లి బొమ్మలు, ఏటికొప్పాక బొమ్మలు, హైదరాబాద్ మంచి ముత్యాలు, ఖాదీ గ్రామోద్యోగ్, ఆయుర్వేద ఔషధాలు, హైదరాబాద్ బజారా ఉత్పత్తులు, లెదర్ బ్యాగులు, ఇమిటేషన్ జ్యూయలరీ, ఒక గ్రాము బంగారు ఆభరణాలు, కళాత్మక ఆభరణాలు ప్రజలు విశేషంగా ఆదరిస్తున్నారు. కాగా ప్రదర్శన ఈనెల 15వ తేదీతో ముగిస్తుందని నిర్వాహకులు జెల్ల సత్యనారాయణ పేర్కొన్నారు.

ఇంటి వద్దకే ఫ్యామిలీ డాక్టర్



వైద్యపరీక్షలు చేస్తున్న అనూష

ఐరాల: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా ప్రజల చెంతకే వైద్యసేవలు అందుతున్నాయని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. బుధవారం గోవిందరెడ్డిపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వైద్యశిబిరంలో వైద్యాధికారి 80 మందికి వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పీహెచ్ఎన్ జీవకళ, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు చేపట్టాలి



కృష్ణాపురంలో దోమల నివారణ మందు పిచికారీ చేయిస్తున్న శ్రీనివాసులు

తవణంపల్లె: గ్రామాల్లో దోమలు నివారించడానికి చర్యలు చేపట్టాలని జిల్లా మలేరియా అధికారి శ్రీనివాసులు తెలిపారు. బుధవారం కృష్ణాపురంలో దోమల నివారణకు మలాథిన్ ద్రావణాన్ని పిచికారీ చేయించే కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. గ్రామాల్లో దోమల వల్ల వచ్చే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. దోమ కాటుకు గురికాకుండా దోమ తెరలు వాడాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వైద్యాధికారి డాక్టర్ ధాత్రేయచౌదరి, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ పీరుసాహెబ్ హెల్త్ అసిస్టెంట్ సుబ్రమణ్యం రెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీ జ్యోత్స్న, ఏఎన్ఎం చాముండీశ్వరి, పాల్గొన్నారు.

నారగల్లులో ఫ్యామిలీ డాక్టర్

గుడిపాల: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలి ఫిజీషియన్‌తో ప్రజలకు ఇంటివద్దే వైద్యం అందుతోందని బొమ్మసముద్రం పీహెచ్‌సీ వైద్యాధికారి అనూష అన్నారు. నారగల్లులో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా వైద్యశిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది సుమతి, హైమావతి, కవిత, ప్రవీణ్, తామరై, గీత పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



రైతులకు చాఫ్‌కట్టర్‌లను అందజేస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

● ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

బంగారుపాళెం: రైతు సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు తెలిపారు. స్థానిక పశువైద్య కేంద్రంలో బుధవారం సాయంత్రం రైతులకు ప్రభుత్వం రాయితీపై పంపిణీ చేసిన చాఫ్‌కట్టర్లు (గడ్డికత్తిరించే యంత్రాలు)ను ఎమ్మెల్యే అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రైతు పక్షపాతి అని పేర్కొన్నారు. పశుసంవర్థక శాఖ జేడీ ప్రభాకర్ మాట్లాడుతూ పాడిపశువుల ఆరోగ్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత కల్పించిందన్నారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ అన్నదాతల అభ్యున్నతి కోసం అనేక రైతు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేశారన్నారు. ఎంపీపీ అమరావతి, డీడీ ఆరిఫ్, ఏడీ విజయమోహన్, జెడ్పీటీసీ సోమశేఖర్, ఎంపీటీసీ సభ్యులు హేమచంద్ర, షబీనా, కురబ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ అమరనాథ్, రైతువిభాగం రాష్ట్ర కార్యదర్శి ప్రవీణ్‌రెడ్డి, కృష్ణమూర్తి, తహసీల్దార్ బెన్నురాజ్, ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

మామిడిలో యాజమాన్య పద్ధతులు పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా హార్టికల్చర్ అధికారి మధుసూదనరెడ్డి

చౌడేపల్లె: మామిడి పంట కోతలు పూర్తయ్యాయని, యాజమాన్య పద్ధతులను పాటించేలా అవగాహన సదస్సులు నిర్వహించాలని జిల్లా హార్టికల్చర్ అధికారి మధుసూదనరెడ్డి ఆదేశించారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో చౌడేపల్లె, సోమల, సదుం, పులిచెర్ల, రొంపిచెర్ల, పుంగనూరు, గంగవరం, పెద్ద పంజాణి మండలాల సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మామిడి తోటల్లో కోతలు పూర్తిచేసిన 20 రోజుల తరువాత కొమ్మల కత్తిరింపులు చేయాలని, ఎండిన కొమ్మలను తొలగించాలని, కత్తిరింపులు చేసిన వెంటనే ఒక లీటరు నీటికి 10 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ ద్రావణం పూయాలన్నారు. రైతులు అధికారుల సూచనలు పాటించి మొక్క వయస్సును బట్టి ఎరువులు వేయాలన్నారు. ఆధునిక పద్ధతులను పాటిస్తే రాబోయే పంటలో అధిక దిగుబడులు పొందేందుకు అవకాశం ఉందన్నారు. సమావేశంలో పుంగనూరు ఏడీఏ శివకుమార్, శాస్త్రవేత్త రాఘవేంద్ర, హార్టికల్చర్ అధికారిణి సంతోషి కుమారి పాల్గొన్నారు.

తలుపుతట్టి కిట్ ఇవ్వాలి



గుడిపాలలో కిట్ల పంపిణీ



బంగారుపాళెంలో..



యాదమరిలో..

● ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

పూతలపట్టు: రాష్ట్ర ప్రభుత్వం తల్లులకు ఇచ్చే బహుమతిని అమ్ముకోవద్దని..తలుపు తట్టి కిట్ ఇవ్వాల్సిందేనన్ని ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అంగన్వాడీ కార్యకర్తలకు సూచించారు. పూతలపట్టు ఎంపీడీ కార్యాలయంలో బుధవారం ఇంటికే వైఎస్సార్ సంపూర్ణ పోషణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే చేతుల మీదుగా పోషణ కిట్లను తల్లులకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ సంపూర్ణ పోషణ కిట్ ప్రతి గర్భిణులు, బాలింతలకు చేరాలన్నారు. ఎంపీడీఓ గౌరి, సూపర్‌వైజర్ నాగరత్నం, వైఎస్సార్‌సీపీ నేతలు జగదీశ్వర్‌రెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, సర్పంచ్ మాసిలామణి, వైస్ ఎంపీపీలు ద్వారకనాథ్‌రెడ్డి, మురళీకృష్ణ, సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు జయచంద్రారెడ్డి పాల్గొన్నారు.

బంగారుపాళెంలో..

బంగారుపాళెం: స్థానిక ఐసీడీసీ కార్యాలయంలో బుధవారం గర్భవతులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను అందజేశారు. ఏఎంసీ చైర్మన్ సోమశేఖర్, ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి, సీడీపీఓ వాణిశ్రీదేవి పాల్గొన్నారు.

ఇంటికే పౌష్టికాహారం

ఐరాల: గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత, పోషకాహార లోప నివారణకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వైఎస్సార్ సంపూర్ణ పోషణ పేరుతో అంగన్వాడీ కేంద్రాల ద్వారా ఇంటికే పౌష్టికాహారం (టేక్ హోమ్ రేషన్) అందించాలనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని పార్టీ మండల కన్వీనర్ బుజ్జిరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో టేక్ హోమ్ రేషన్ (ఇంటికే పోషకాహార కిట్) పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్‌లను పంపిణీ చేశారు. పార్టీ నేతలు సురేష్‌రెడ్డి, సురేంద్రయాదవ్, మురళి, ఎంపీడీఓ నాగరాజు, ఎంఈఓ–2 దామోదర్‌నాయుడు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు లలితమ్మ, మంజుల పాల్గొన్నారు.

టేక్ హోమ్ రేషన్ పంపిణీ

గుడిపాల: గర్భవతులు, బాలింతలకు ఇంటివద్దకే టేక్ హోమ్ రేషన్ పంపిణీ చేస్తున్నట్లు ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. బుధవారం గుడిపాల ఎంపీడీఓ కార్యాలయంలో గర్భిణులు, బాలింతల సౌకర్యార్థం ఇంటికే పోషకాహార కిట్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తల్లి, బిడ్డ సంపూర్ణమైన ఆరోగ్యంగా ఉండాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉద్దేశమన్నారు. అనంతరం వైఎస్సార్ పోషణ కిట్ అందజేశారు. తహసీల్దార్ బాబూరాజేంద్రప్రసాద్, ఎంపీడీఓ రాజశేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ యువత అధ్యక్షుడు శిలంబరసన్, అంగన్వాడీ సూపర్ వైజర్లు స్వర్ణలతాదేవి, టోయాజాక్షి, లక్ష్మి పాల్గొన్నారు.



కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

పౌష్టికాహారంతోనే తల్లులకు బలం

చిత్తూరు రూరల్: పౌష్టికాహారంతోనే తల్లులకు బలమని వారిలోని లోపాల నివారణకు ప్రభుత్వం ఇంటికే వైఎస్సార్ సంపూర్ణ పోషణ అందిస్తోందని జెడ్పీటీసీ ఎం.ఎస్ బాబునాయుడు అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఇంటికే వైఎస్సార్ సంపూర్ణ పోషణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రజాప్రతినిధులు, అధికారుల చేతుల మీదుగా తల్లులకు పోషణ కిట్లను అందజేశారు. ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి, డీటీ కిరణ్, ఎంపీటీసీ ప్రతిమారెడ్డి, సూపర్‌వైజర్ కవిత, నేతలు సంపత్ పాల్గొన్నారు.

తవణంపల్లె: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం కింద టేక్ హోమ్ రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎంపీడీఓ అబ్దుల్‌కలాం ఆజాద్, తహసీల్దార్ గుణశేఖర్‌రెడ్డి, ఎంఈఓ త్యాగరాజులరెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ హరికృష్ణారెడ్డి, ఐసీడీఎస్ పర్యవేక్షకులు రెడ్డికల్యాణి, సరళకుమారి, కవిత, నేతలు పరమేశ్వరరెడ్డి, ప్రకాష్‌బాబురెడ్డి, మధుకుమార్ పాల్గొన్నారు.

కాణిపాకంలో..

కాణిపాకం(యాదమరి): అగరంపల్లె అంగన్వాడీ కేంద్రంలో స్థానిక సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డి గర్భవతులకు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్‌లు పంపిణీ చేశారు.

యాదమరిలో..

యాదమరి: స్థానిక అంగన్వాడీ కేంద్రంలో గర్భవతులకు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్‌లను ఆమె అందించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు మమత, హేమలత పాల్గొన్నారు.



ఐరాలలో..



తవణంపల్లెలో..



అగరంపల్లె అంగన్వాడీ కేంద్రంలో..



చిత్తూరులో..